జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 24 | సెప్టెంబర్ | 2026 ♦ పేజీలు : 6



# సంక్షేమ హాస్టల్స్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- అడ్లూరికి ఎమ్మెల్యే రాగమయి వినతి



సత్తుపల్లి సెప్టెంబర్23 (ప్రజాజ్యోతి) నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ బుధవారం హైదరాబాద్ సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ,ఎస్టీ మైనారిటీ ,బీసీ సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతుల అభివృద్ధితోపాటు, విద్యార్థులకు భద్రత ఉండే విధంగా అవసరమైన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఆమె వివరించారు. నియోజకవర్గం లోని సాంఘిక సంక్షేమ,ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనారిటీ హాస్టల్ లో పరిస్థితి, స్థితిగతులను మంత్రికి వివరించారు. విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన వాతావరణం కల్పించేందుకు ,ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తేనే చక్కగా చదువుకొని ఉన్నత స్థితిలో చేరుకుంటారని, హాస్టల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆయనను కోరారు.


# వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
- 24 గంటల పాటు అందుబాటులో కంట్రోల్ రూమ్
- అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
- టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని వాగులు, వంకలు,చెరువులు,ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతా లు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద నీటి ప్రవాహం

మిగతా 2 లో...




- రైతుల నమ్మకమే పెట్టుబడిగా.. నగదే లక్ష్యంగా?
- అవసరమొస్తే ఓ కథ.. డబ్బులు వస్తే ఓ హామీ!
- 22 మందికి పైగా బాధితుల ఫిర్యాదులతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- చెక్కు చేతిలో పెట్టి.. చెల్లింపు మాత్రం గాలిలో!

# మాటలు తియ్యగా... లెక్కలు ఘాటుగా!

ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజలకు అండగా నిలవాలి.. రైతు అంటే సమస్య చెబితే పరిష్కారం చూపాలి. కానీ ఇక్కడ కథ కాస్త తేడాగా ఉందని బాధితుల ఆరోపణలు చెబుతున్నాయి. మాటల్లో మమకారం.. అవసరాల్లో ఆపద.. చివరికి డబ్బుల దగ్గర లెక్క! అంటూ బాధితులు వాపోతున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు సెక్టార్ ఏఈఓగా పనిచేస్తున్న బానోత్ కళ్యాణ్‌పై పలువురి నుంచి డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించలేదనే ఆరోపణలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

● తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి

# భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య
- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు

మిగతా 2 లో...

# మానవత్వాన్ని చాటుకున్న ఎర్రుపాలెం పోలీస్ సిబ్బంది

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ నేరాలను నియంత్రిస్తూ సమాజంలో మెరుగైన శాంతిభద్రతలు నెలకొల్పుతూ కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులను సైతం విడిచిపెట్టి కర్తవ్యం కోసం అహర్నిశలు పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది ప్రజల భద్రత కాదు ప్రాణాలను కూడా కాపాడుతామని నిరూపించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది మండల పరిధిలోని మామునూరు గ్రామంలో సోమవారం వినాయకుని ఊరేగింపులో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి అదే గ్రామానికి చెందిన బాలిక సామినేని లక్ష్మీ ప్రణతి(13) పాము కాటుకు గురైన విషయాన్ని తెలుసుకొని ఏఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారి సొంత వాహనంలో బాలికను హుటాహుటిన బనిగండ్లపాడు ప్రాథమిక

మిగతా 2 లో...



## వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి...)

అధికంగా ఉన్న వాగులు,వంకలు,కాలువలు,చెరువులు,నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.విద్యుత్ స్తంభాలు,తెగిపోయిన విద్యుత్ తీగలు,నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.రెవెన్యూ,పోలీస్,పంచాయతీరాజ్,మున్సిపల్,నీటిపారుదల,వైద్య,విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్: 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థితులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఎర్రుపాలెం పోలీస్ సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి...)

ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు తరువాత మెరుగైన చికిత్స కోసం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తరలించారు పాము కాటుకు గురై ఆపదలో ఉన్న ఓ బాలికను పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు.పోలీసుల సత్వర స్పందనతో బాలికకు వైద్యులు వెంటనే చికిత్స అందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆపద సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి బాలిక ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన ఏఎస్ఐ చంద్రశేఖర్ బ్లూ కోటు సిబ్బంది ఉపేందర్ కృష్ణ శివ ప్రసాద్ డ్రైవర్ కం గన్మాన్ చంద్రశేఖర్ లను స్థానికులు అభినందించారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు పేర్కొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**ఎర్రుపాలెం, ప్రజాజ్యోతి** మండల పరిధిలోని రాజులుదేవరపాడు ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జంగా గురునాధరెడ్డి బుధవారం ప్యానెల్ ఇన్స్పెక్షన్ లో భాగంగా పాఠశాల ను సందనర్శించి ఉపాధ్యాయుల బోధన విధానం పరిశీలించి పాఠశాలలోని మౌలిక వసతులు గురించి విద్యార్థుల హాజరు శాతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అల్పాహార నాణ్యత గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మారపాక బాబురావు అడిగి తెలుసుకున్నారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకొని తొలిసారిగా పాఠశాలను సందర్శించిన గురునాథరెడ్డిని ప్రధానోపాధ్యాయులు మారపాక బాబురావు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి గ్రామ సర్పంచ్ పాశం అనూష ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పి నాగమణి ఉప సర్పంచ్ ప్రమీల, గ్రామ పెద్దలు పాశం రవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అంజలి,ప్రీ ప్రైమరీ టీచర్స్ వెంకట్రావమ్మ, నందిని,భవాని,అంగన్వాడీ టీచర్స్ విజయలక్ష్మి ,నాగమణి, వార్డు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు

# మాటలు తియ్యగా.. లెక్కలు ఘాటుగా!




**మాటకు మాయ.. అవసరానికి న్యాయం!**

“ఇది అర్జెంట్.. రేపే ఇస్తా” అన్న మాటతో మొదలైన వ్యవహారం.. “ఇంకొంచెం టైం ఇవ్వండి” అంటూ రోజులు దాటిందని బాధితులు చెబుతున్నారు. క్రెడిట్ కార్డు బిల్లు, గోల్డ్ లోన్ రెన్యూవల్, యూరియా కట్టలు, కుటుంబ సభ్యుల వైద్యం.. కారణం ఏదైనా చివరికి అడిగింది మాత్రం డబ్బేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుమలాయపాలెం, తాళ్లచెరువు, బచ్చోడు, బీరోలు, బంధంపల్లి, దమ్మాయిగూడెం తదితర గ్రామాలకు చెందిన పలువురు ఈ వ్యవహారంలో బాధితులుగా ఉన్నట్లు సమాచారం.

**చిల్లర కాదు.. చెల్లెలి పెళ్లి కాదు.. లక్షల లెక్క!**

రూ.30 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు ఒక్కొక్కరి వద్ద నుంచి తీసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రూ.50వేలు..రూ.60వేలు..రూ.80 వేలు.. రూ.95 వేలు.. ఇలా అంకెలు పెరుగుతూనే వెళ్లాయని చెబుతున్నారు. “చిన్న మొత్తం కదా.. ఇస్తా” అంటూ మొదలైన మాట.. చివరికి “ఎప్పుడు ఇస్తావు?” అనే ప్రశ్నగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 22 మంది బాధితుల వివరాలు అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. మొత్తం వ్యవహారం ఎంత అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

**లీవ్ వచ్చింది.. కథ బయటపడింది!**

ఏఈఓ కళ్యాణ్ కొంతకాలంగా వైద్య సెలవులో ఉండటంతో కార్యాలయానికి రాకపోవడం మరో మలుపుగా మారింది. డబ్బులు ఇచ్చినవారు ఒక్కొక్కరుగా వ్యవసాయశాఖ కార్యాలయం మెట్లు ఎక్కారు.

ఒకరి తర్వాత ఒకరు తమ గోడు చెప్పడంతో “ఇంతమందా?” అనే పరిస్థితి అధికారుల ముందుకొచ్చినట్లు సమాచారం.

బాధితుల వివరాలు సేకరించడంతో జాబితా పెరిగినట్లు తెలుస్తోంది. మరి కొందరు కూడా ముందుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం.మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన రామనబోయిన మహేష్ తన వద్ద తీసుకున్న రూ.95 వేల కోసం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. పోలీసుల సమక్షంలో డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చి చెక్కు ఇచ్చినట్లు బాధితుడు చెబుతున్నాడు.కానీ చెక్కు బ్యాంకు గడప దాటగానే కథ మళ్లీ మలుపు తిరిగిందని బాధితుడు పేర్కొంటున్నాడు.

చెక్కును డిపాజిట్ చేయగా చెల్లింపు జరగకపోవడంతో పోలీసులతో పాటు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపాడు. చేతిలో చెక్కు ఉన్నా.. ఖాతాలో నగదు లేకపోతే నమ్మకానికి విలువ ఎంత? అన్న ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**గతంలోనూ ఆరోపణలు.. ఇప్పుడు మళ్లీ చర్చ**

కళ్యాణ్ గతంలో పనిచేసిన ప్రాంతంలో రైతు బీమా నగదు వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయని, ఆ ఘటనలో సస్పెన్షన్ ఎదుర్కొన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశంపై సంబంధిత శాఖ నుంచి అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

**“మాకు డబ్బులు కావాలి.. హామీలు కాదు!”**

ప్రస్తుతం బాధితుల మాట ఒక్కటే— “మాయమాటలు చాలయ్యాయి.. మా డబ్బులు మాకు ఇప్పించండి”. వ్యవసాయశాఖలో పనిచేసే ఉద్యోగిపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆ శాఖ ప్రతిష్ఠపైనా ప్రభావం చూపుతుందని స్థానికులు అంటున్నారు.

వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని బాధితులు కోరుతున్నారు. ఆరోపణలు రుజువైతే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాటలు నమ్మి డబ్బులిచ్చినవారు ఇప్పుడు లెక్కలు పట్టుకుని తిరుగుతున్నారు.. హామీలు విన్నవారు ఇప్పుడు సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. అసలు నిజం ఏంటి?—విచారణ తేల్చాల్సిందే!

## భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం



(మొదటి పేజీ తరువాయి...)

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు.బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు.నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు,ఉత్సవ కమిటీ సభ్యులు,అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది,పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో,గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు



అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు.శోభాయాత్రలో పాల్గొనే భక్తులు,నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా,విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ, మునిసిపల్ అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి,వర్కింగ్ ప్రెసిడెంట్ జి.విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్నకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

## రైతులకు శాపం- సర్పంచ్ ల ఆవేదన





- సర్పంచులతో ఎంపీడీవో కావ్య సమావేశం..
- సమస్యలు పరిష్కరించకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరిక

**వేంసూరు సెప్టెంబర్ 23 ప్రజాజ్యోతి** మండల విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభలు, పంచాయతీ సమావేశాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప, నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సమస్యలపై సర్పంచులు, విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈలతో ఎంపీడీవో కావ్య బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగపాలెం సర్పంచ్ యర్రా రమేష్, కందుకూరు సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, భీమవరం సర్పంచ్ వంట్ల రమేష్ మాట్లాడుతూ.. తమ గ్రామాల్లో నెలలుగా విద్యుత్ సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలను ఏఈ దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారని, ఏడీఈకి ఫిర్యాదు చేసినా వెంటనే ఏఈతో మాట్లాడి పరిష్కరిస్తానని చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదన్నారు.

**ధర్నా చేసినా.. పరిష్కారం లేదు**

వారం రోజుల క్రితం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కందుకూరు సబ్‌స్టేషన్ వద్ద రైతులు విద్యుత్ సమస్యలపై భారీ ధర్నా నిర్వహించిన విషయాన్ని సర్పంచులు గుర్తుచేశారు. కందుకూరు, వెంకటాపురం, లచ్చన్నగూడెం, మర్లపాడు, భరిణపాడు, దుద్దేపూడి గ్రామాలకు చెందిన రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఏడీఈ తరచూ మండలంలో పర్యటిస్తున్నప్పటికీ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తన దృష్టికి రాలేదనటం ఆశ్చర్యంగా ఉందని సర్పంచులు పేర్కొన్నారు. గ్రామాల్లో త్రీ ఫేస్ విద్యుత్ కారణంగా 6,7 గంటల కంటే మించి ఉండటం లేదని ... అది కూడా తరుచూ వస్తూ పోతూ ఉండటం తో ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారిందని, అలాగే రైతులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సమావేశాల్లో హామీలు ఇవ్వడం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరంగల్‌లోని ఉన్నత విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరిస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఏ డి ఈ త్వరలోనే మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు... ఈ సమావేశంలో వేంసూర్ సర్పంచ్ ఎండి ఫక్రుద్దీన్, కల్లూరు గూడెం సర్పంచ్ రామి రెడ్డి పాల్గొన్నారు

## అన్నదానం మహాదానం

- ఎర్రుపాలెం ఎస్సై రమేష్ కుమార్.





**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై. ఎం రమేష్ కుమార్, కమిటీ సభ్యులతో కలిసి అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్సై రమేష్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమంలో పాల్గొనాలని అన్నిదానాల కన్నా అన్నదానం మహాదానం అని ఈలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన కోరినారు అన్న ప్రసాదం నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు,భక్తులు సహకారంతో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై రమేష్ కుమార్ ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బూర్గుల రాజశేఖర్ రెడ్డి, కొప్పుల సురేష్, బూర్గుల శశిధర్ రెడ్డి, వేమిరెడ్డి సాయి పవన్ రెడ్డి, ఇండ్ల నాగ ఫణీంద్ర, బలుసుపాటి రాంబాబు,ముచ్చంతల భరత్,ముచ్చింతల గణేష్, ఇండ్ల అనిల్ కుమార్,ముచ్చంతల పూర్ణ, బత్తిన భాస్కర్, ముచ్చంతల సాయికుమార్, టెంటు సాయి,ముచ్చంతల జగదీష్, ముచ్చింతల రాము పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన మండల అధికారుల బృందం



**కారేపల్లి, సెప్టెంబర్ 23, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా విగ్రహాల నిమ్మజనం జరిగే చెరువు, వాగు ప్రాంతాలను బుధవారం సింగరేణి తహశీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు మండల పంచాయితీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్,పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బైరు గోపి ల బృందం సందర్శించి స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు సలహాలు సూచనలు చేసారు. రాబోవు రెండు రోజులు భారీ వర్షాలు సైతం ఉన్నందున ప్రజలు నిమజ్జనం చేసే సందర్భంలో లోతైన ప్రాంతాలకు ఎట్టి పరిస్థితి లో ఎవరు వెళ్లొద్దని , మరి ముఖ్యంగా చిన్న పిల్లల్ని నిమ్మజన ప్రాంతాల్లో తీసుకు రావద్దని అధికారుల బృందం తెలిపింది, నిమజ్జనం సందర్భంగా కమిటీ వారు తమ జాగ్రత్తలు పాటించాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. మండలంలోని వినాయక నిమజ్జనం నిర్వహించే అన్ని ప్రాంతాలతో పాటు గేట్ కారేపల్లి లో నిమజ్జనం జరిగే పెద్ద చెరువును, చెరువు పరిసరాలను పరిశీలించి సర్పంచ్ పూసం ఎల్లయ్య, కార్యదర్శి కె. అనూషలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ,బి . జగదీశ్, సింగరేణి పంచాయతీ కార్యదర్శి బి.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి:** ప్రస్తుత పరిస్థితులలో ప్రతీ ఒక్కరూ ఆహారపు ఆలవాట్లు మార్చుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్.మంగళ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ లో బుధవారం ఆయుర్వేద దినోత్సవం ను నిర్వహించారు. తొలుత మహర్షి ధన్వంతరి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్య శిభిరం ను నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...ఆయుర్వేద గొప్పతనం ను వివరించారు. ఔషద మొక్కల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్.రాజా, డాక్టర్.నీలిమ, ఫార్మసిస్ట్ మాన్సింగ్ ' యోగా ఇన్స్ట్రక్చర్స్ క్రాంతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

- రాజారాంపేట లడ్డూ పాట రూ.80 వేలకు కైవసం



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి :** మండలం లోని వివిధ గ్రామాలలో వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామచంద్రాపురం, రాజేశ్వరపురం, నేలకొండపలి తదితర గ్రామాలలో చివర రోజు అన్నదానం నిర్వహించారు. మండలం లోని రాజారాంపేట లో లడ్డూ వేలం పాట 'ను నిర్వహించారు. గ్రామానికి చెందిన కంటు రామయ్య కుటుంబ సభ్యులు రూ.80 వేలకు సొంతం చేసుకున్నారు. అదే విధంగా మండపం వద్ద ఉంచిన పెన్ను వేలం పాటను రూ.16,500కు గోనెల ఉపేందర్ దక్కించుకున్నారు. నేలకొండపల్లి లో మండపం వద్ద లక్కీ కూపన్ ద్వారా లాటరీ లో కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి అన్నపూర్ణ లడ్డూ పొందారు. మండలం లోని వినాయక నిమజ్జనం లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎస్సై శ్రీనివాస రెడ్డి లు పర్యవేక్షించారు. మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన విగ్రహాలను బౌద్ధక్షేత్రం వద్ద చెరువు, చెరువుమాధారం చెరువు లో నిమజ్జనం చేశారు. వివిధ గ్రామాలలో డీజెలతో ప్రదర్శనలు నిర్వహించటంతో డిజేలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. పలు చోట్ల కమిటి ప్రతినిధులు బాణాసంచాలు కాల్చి..నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆనందోత్సాల మధ్య నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

## బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం




**నేలకొండపల్లి, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి :** బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తుతం చేయనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలం లోని సింగారెడ్డిపాలెం అంగన్వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం ను నిర్వహించారు. కేంద్రంలో శ్రమదానం కార్యక్రమం ను నిర్వహించారు. పిచ్చి మొక్కలను, చెత్తాచెదారం ను తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. మండలం లోని ప్రతీ పల్లెలో ప్రజాహిత కార్యక్రమాలు విస్తుతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, పురాణం దివాకర్, షేక్ షర్ఫుద్దీన్, కొండా హర్షవర్ధన్.గెల్లా చక్రపాణి, వీరునాయక్, బాణోత్ శ్రీనివాస్, తుపాలకు సంజన తదితరులు పాల్గొన్నారు

## మైనార్టీ బాలికల గురుకులంలో ఆయుర్వేదం,యోగా పై అవగాహన

- ఆయుర్వేద వైద్యురాలు జీ. తన్మయి.




**కారేపల్లి, సెప్టెంబర్ 23, ప్రజాజ్యోతి:** యోగాతో రోగాలు దూరం అవుతాయని, ఆయుర్వేద మందుల వాడకంతో సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు జి. తన్మయి అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల /జూనియర్ కళాశాల లో బుధవారం చిన్నారులకు ఆయుర్వేదం,యోగా పై అవగాహన కల్పించి, ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, బాలికలకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్మయి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఆయుర్వేద మందులు ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుతాయని, ఈ మందులు వాడడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయన్నారు. అదేవిధంగా బాలికలకు వచ్చే జబ్బుల గురించి వివరించి, వాటిని ఏ విధంగా నివారించుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి .సావిత్రి , వైద్య సిబ్బంది ఫార్మసిస్ట్ స్వాతి ,ప్రభాకర్ ,నర్సింగ్ ఆఫీసర్ జె .మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశానికి వెలుగు బాట వీర శ్రీకాకుళం

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కేంద్ర, నాయకులు, సాదినేని వెంకటేశ్వరరావు,,జె వి ,చలపతిరావు అవునూరి మధు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకురాలు శ్రీకాకుళ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ పైల చంద్రక్క ఆరో వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం జరిగిన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, వీర శ్రీకాకుళం సాయుధ పోరాటంలో అమరులైన ఎందరో వీరుల్ని స్ఫూర్తిగా తీసుకొని చిన్నతనంలోనే ఉద్యమంలోకి వచ్చింది ఆనాటి నుండి చనిపోయే వరకు విప్లవ రాజకీయాలకు దృఢంగా కట్టుబడి, భూస్వామ్య పెత్తందారులకు, దొరలకు దోపిడీ దారులకు వ్యతిరేకంగా గిరిజనుల కూడగట్టి పోరాడింది ప్రజలను చైతన్యవంతం చేసింది, అనేక సంవత్సరాలు రహస్య జీవితం గడిపింది, తన బిడ్డను కూడా తెలిసినవారికి ఇచ్చి ఉద్యమంలో పనిచేసింది తన బిడ్డ ఎనిమిదో తరగతి చదివేంతవరకు చూడలేదు ఉద్యమ క్రమంలో పోలీసు దాడులు నిర్బంధాలు ఎన్కౌంటర్ల నుండి తృటిలో తప్పించుకున్న ఘటనలు ఉన్నాయి సహచరులు చనిపోయిన ఈ ధైర్యంతో ముందుకు సాగింది, పోలీస్ చెరలో చిక్కి 13 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపింది,పెరోల్ పై బయటకు వచ్చి రహస్య పనులు చేస్తున్న క్రమంలో ఆయుధాలతో విక్రమ్ అన్నతో కలసి మరల అరెస్టు అయింది, చిత్ర హింసలు అనుభవించింది, శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాట ప్రాంతాలలో తీవ్ర నిర్బంధకాలంలో ప్రజల మధ్య ఉండి పని చేసింది, ఈ దేశంలో శ్రామిక రాజ్యం రావాలని, వర్గ దోపిడీ రద్దుచేసి వర్గ రహిత సమాజం కోసం,అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం మార్క్సిజం లెనినిజం, మావో ఆలోచన విధానవెలుగులో జీవితాంతం పోరాడింది నేటితరం వారి త్యాగాలను స్ఫూర్తి తీసుకొని పని చేసినప్పుడే ఆమెకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు, ఈ కార్యక్రమంలో ,జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య నాయకులు, కే లక్ష్మీనారాయణ,ఎం గిరి ,ఐ వెంకన్న, సుదర్శన్, కిషన్, మోహన్ రావు శ్రీకాంత్,జాన్ రెడ్డి, క్రాంతి, ఉదయ్,విజయ్,భరత్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పండుగలా 'పోషణ్ మాసం..

- పోషకాహార లోపంపై సమరభేరి...
- సెప్టెంబర్ నెల రాగానే అంగన్వాడీ కేంద్రాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామం నందు గల అంగన్వాడీ 3 సెంటర్ లో బుధవారం నిర్వహించిన పోషన్ మాస కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ్ కుమార్, కార్యదర్శి హరికృష్ణ, ఎంవి పాలెం సెక్టార్ సూపర్వైజర్ నీరజ పాల్గొని, పోషన్ మాస వారోత్సవాలను పురస్కరించుకొని వారు మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పారద్రోలాలనే దృఢ సంకల్పంతో నిర్వహిస్తున్న 'రాష్ట్రీయ పోషణ్ మాసం' (జాతీయ పోషకాహార మాసోత్సవాలు) జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతున్నాయని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని నిజం చేస్తూ, క్షేత్ర స్థాయిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ కుమార్ అన్నారు. అనంతరం సెక్టార్ సూపర్వైజర్ నీరజ మాట్లాడుతూ... అవగాహన ర్యాలీలు, మహిళల భాగస్వామ్యం పోషకాహారం ప్రాముఖ్యతను సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా వివరించేందుకు ప్రతిరోజూ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నామని వీధుల్లో అవగాహన ర్యాలీలు తీయడం, మహిళలకు పోషకాహార ఇతివృత్తంతో ముగ్గుల పోటీలు నిర్వహించడం ద్వారా ప్రాధాన్యతను చాటిచెబుతున్నారని, ముఖ్యంగా స్థానికంగా దొరికే ఆకుకూరలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్), గుడ్లు, పాలు వంటి వాటితో కూడిన సమతుల్య ఆహారం దైనందిన జీవితంలో ఎలా భాగం చేసుకోవాలో తల్లులకు వివరిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ.. ఆరోగ్య పర్యవేక్షణ, బాలామృతం వంటకాలు ఈ మాసంలో చిన్నారుల ఎత్తు, బరువులను ప్రత్యేకంగా కొలుస్తూ వారి శారీరక ఎదుగుదలను నిశితంగా ట్రాక్ చేస్తున్నారు. గర్భిణుల్లో మరియు కౌమారదశలోని బాలికల్లో ఎక్కువగా కనిపిస్తున్న రక్తహీనత (ఎనీమియా) నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న 'బాలామృతం' పొడితో కేవలం అంబలి మాత్రమే కాకుండా.. లడ్డూలు, దోశలు, బర్ఫీ వంటి రుచికరమైన, బలవర్ధకమైన వంటకాలను ప్రదర్శించి తల్లులకు రుచి చూపిస్తున్నారు. "సరైన పోషణ – దేశానికి వెలుగు" అనే నినాదంతో సాగుతున్న ఈ పోషణ్ మాసం కార్యక్రమాలు సామాన్యుల్లో ఎంతో మార్పును తీసుకువస్తున్నాయి. అధికారుల నిరంతర పర్యవేక్షణ,అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో ప్రతి బిడ్డా ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యం దిశగా అడుగులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు "రేవతమ్మ",కాంత లక్ష్మి ,పుష్ప, ఆయా "అజిత కుమారి"మరియు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

- మండల అధ్యక్షుడిగా గోవింద సురేష్, ఉపాధ్యక్షులుగా మాగి వెంకన్న, జినక మల్లయ్య ఏకగ్రీవ ఎన్నిక
- ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా జినక రమేష్
- నూతన కమిటీకి జిల్లా నాయకుల సమక్షంలో బాధ్యతలు
- ఉద్యమాన్ని గ్రామ స్థాయికి విస్తరిస్తామని నాయకుల వెల్లడి





**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 23:** తిరుమలాయపాలెం మండలంలో ఎమ్మార్పీఎస్‌కు నూతన నాయకత్వం ఏర్పడింది. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి చింతిరాల నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోవింద సురేష్‌ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా, జినక రమేష్‌ను మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ) మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు సురుగంటి అంజయ్య మాదిగ తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. మండల స్థాయిలో ఉద్యమ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు వివిధ బాధ్యతలను నాయకులకు అప్పగించారు. ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా ఉడుగు మధును ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా మాగి వెంకన్న, జినక మల్లయ్యలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా ధర్మపురి చంటి, గొర్రెపాటి శ్రీశైలం బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శులుగా రాయిండ్ల వినోద్, గొర్రెపాటి లింగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ శాఖల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. గ్రామస్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సామాజిక సమస్యలపై సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు. సీనియర్ నాయకుడు పగిడిపల్లి బాబు మాట్లాడుతూ ఉద్యమంలో అనుభవజ్ఞుల సూచనలు, యువత భాగస్వామ్యం కలిసి సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షురాలు సైదాబీ నూతన కమిటీకి మద్దతు తెలిపారు.

**హక్కుల సాధనకు కృషి...**

నూతన మండల అధ్యక్షుడు గోవింద సురేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. మండలంలోని దళితుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎమ్మార్పీఎస్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన జినక రమేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీ ఏర్పాటుతో మండలంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకలాపాలకు మరింత ఊపునిచ్చేలా పనిచేస్తామని నాయకులు తెలిపారు.

## పీ.వీ.ఎన్.ఆర్ కాలనీలో గణేష్‌ను దర్శించుకున్న ఐఎన్‌టీయూసీ కోటి



**సత్తుపల్లి సెప్టెంబర్ 23(ప్రజా జ్యోతి )** సింగరేణి పీవీఎన్ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న గణేష్‌నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు నిర్వహించిన గణేష్ పూజా కార్యక్రమంలో,సత్తుపల్లి ఏరియా ఐ.ఎన్.టీ.యూ.సీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, కాలనీవాసులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గణేశుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న, కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావుకు శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రశేఖర్,మల్లేష్, నాగప్రకాష్, రఘువీర్,షణ్ముఖ చారి, దాసరి శీను,సందీప్, సతీష్,లక్ష్మణ్,రఘుపతి, నరేందర్,రాజేందర్,గోనె సతీష్‌కుమార్ తదితరులతో పాటు కాలనీవాసులు,మహిళలు పాల్గొన్నారు.

# భక్తులకు.. దేవుడికి మధ్య మరో ఎడది!

- జోరుగా కురిసిన వాన లోనూ ఆగని గణనాథుడి నిమజ్జన వేడుకలు
- వర్షపు జల్లుల్లో మార్మోగిన గణపతి నామస్మరణ
- కన్నీటి వీడ్కోలుతో గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు
- అడుగడుగునా భక్తి.. ఊరేగింపులో ఉత్సాహం.. నిమజ్జనం వేళ భావోద్వేగం







**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 23 :** ఉత్సవాల సందడి ముగిసింది.. దప్పుల దరువు కాస్త నెమ్మదించింది.. గణపయ్యకు పెట్టిన నైవేద్యాల పరిమళం జ్ఞాపకంగా మిగిలింది.. మండపాల్లో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలు ఒక్కొక్కటిగా నిమజ్జనానికి తరలాయి.ఇన్ని రోజులూ తమ ఇంటి దేవుడిగా, తమ ఊరి దేవుడిగా, తమ కుటుంబ సభ్యుడిగా భావించిన గణనాథుడికి భక్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.వినాయక చవితి రోజు ఘనంగా ప్రతిష్ఠించిన గణపయ్యను ఇన్ని రోజులూ భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉదయం, సాయంత్రం హారతులు ఇచ్చారు. పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులు.. ఇలా ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా పూజల్లో భాగస్వాములయ్యారు. మండపం చుట్టూ సందడి చేశారు. ప్రసాదాలు పంచుకున్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవ వాతావరణాన్ని ఆస్వాదించారు.కానీ నిమజ్జనం రోజు వచ్చేసరికి అదే మండపం వద్ద వాతావరణం మారిపోయింది. నిమజ్జనానికి గణపయ్యను తీసుకెళ్లే సమయంలో భక్తుల గొంతుల్లో 'గణపతి బప్పా మోరియా' నినాదాలు మార్మోగినా.. మనసుల్లో మాత్రం తెలియని బాధ. ఇన్ని రోజులు తమ కళ్లముందు ఉన్న గణనాథుడు ఇక కనిపించడనే ఆలోచన భక్తులను భావోద్వేగానికి గురిచేసింది. చిన్నారులు గణపయ్యను చూస్తూ చేతులు ఊపారు. మహిళలు హారతులు ఇచ్చారు. యువకులు ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. పెద్దలు భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కో మండపం నుంచి గణపయ్య, గంగమ్మ ఒడికి బయలుదేరుతుంటే.. ఆ ప్రాంతంలో ఒక వెలితి కనిపించింది. నిమజ్జనం అంటే కేవలం విగ్రహాన్ని నీటిలో కలపడం కాదు.. భక్తుడు, దేవుడి మధ్య ఏర్పడిన అనుబంధానికి ఒక భావోద్వేగమైన వీడ్కోలు. మట్టి రూపంలో వచ్చిన గణపయ్యను భక్తులు దేవుడిగా భావించి పూజిస్తారు. చివరికి అదే మట్టిరూపం నీటిలో కలిసిపోతుంది. 'వెళ్లిరా గణపయ్య.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా' అంటూ భక్తులు పలికే మాటల్లోనే ఆ అనుబంధం కనిపిస్తుంది. నిమజ్జనం తర్వాత మండపం ఖాళీ అవుతుంది.. కానీ అక్కడ గడిపిన రోజులు, చేసిన పూజలు, పంచుకున్న ప్రసాదాలు, వినిపించిన భజనలు మాత్రం భక్తుల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి.

**ఊరేగింపులో ఉత్సాహం.వర్షంలోనూ సాగిన ఊరేగింపు..**

ఆకాశం నిండా మేఘాలు.. జోరందుకున్న వర్షం.. రహదారులపై వర్షపు నీరు.. అయినా గణనాథుడి నిమజ్జన వేడుకలకు భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షం కురుస్తున్నా భక్తులు వెనక్కి తగ్గకుండా గణపయ్యను నిమజ్జనానికి తరలించారు. వర్షపు జల్లుల్లో తడుస్తూనే గణపతి నామస్మరణ చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. దీంతో వర్షం మధ్య సాగిన గణనాథుడి నిమజ్జన వేడుకలు ప్రత్యేకంగా నిలిచాయి,గణపతి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై అలంకరించి నిమజ్జనానికి తరలించారు. డప్పుల మోత, భక్తి గీతాలు, గణపతి నామస్మరణల మధ్య ఊరేగింపు కొనసాగింది. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు తడుస్తూనే ఉత్సాహంగా ముందుకు సాగారు. నిమజ్జన ఊరేగింపు ప్రారంభమైన వెంటనే యువతలో ఉత్సాహం ఉరకలేసింది. డప్పుల మోత, భక్తిగీతాలు, నినాదాలతో వీధులు మార్మోగాయి. చిన్నారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు వీడ్కోలు పలికారు. కొంతదూరం వరకు ఆనందంగా సాగిన ఊరేగింపు నిమజ్జన ప్రదేశానికి చేరుకోగానే భక్తుల ముఖాల్లో భావోద్వేగం స్పష్టంగా కనిపించింది. చివరిసారిగా గణపయ్యకు హారతి ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకుని నిమజ్జనం చేశారు. గణపయ్య నిమజ్జనమైన తర్వాత భక్తులు తిరిగి ఇళ్లకు వెళ్లారు.

**వర్షం గుర్తుగా.. జ్ఞాపకం పదిలంగా**

సాధారణంగా నిమజ్జనం అంటే భక్తులకు ఆనందంతో పాటు భావోద్వేగం కలగలిసిన సందర్భం. ఈసారి దానికి వర్షం కూడా తోడవడంతో వేడుకలకు మరో ప్రత్యేకత ఏర్పడింది. వర్షాన్ని లెక్కచేయకుండా గణపయ్య వెంట నడిచిన భక్తులు.. తడుస్తూనే నామస్మరణ చేసిన యువత.. వర్షపు జల్లుల్లో హారతులు ఇచ్చిన మహిళలు..నిమజ్జనాన్ని ఆసక్తిగా తిలకించిన చిన్నారులు.. ఇలా ప్రతి దృశ్యం భక్తుల జ్ఞాపకాల్లో నిలిచిపోయింది. 9 రోజులు పూజలు అందుకున్న గణనాథుడి మండపలు ఖాళీగా కనిపించింది. కానీ వారి మనసుల్లో మాత్రం గణపయ్య ఇంకా కొలువుదీరే ఉన్నాడు.వినాయకుడి నిమజ్జనం భక్తికి ముగింపు కాదు.. మరోసారి గణపయ్యను ఆహ్వానించే ప్రారంభం. అందుకే నిమజ్జనం వేళ కళ్లలో నీళ్లు తిరిగినా.. పెదవులపై మాత్రం ఒక్కటే మాట "గణపయ్యా.. వచ్చే ఏడాది మళ్లీ రావాలి.. మా ఇంటికి, మా ఊరికి, మా గుండెల్లోకి!" అదే భక్తులకు.. దేవుడికి మధ్య ఉన్న ఆత్మీయ బంధం. నిమజ్జనం దేవుడిని దూరం చేయదు.. భక్తుల జ్ఞాపకాల్లో మరింత దగ్గర చేస్తుంది.

## వర్షంలో తడుస్తూ.. వెలుగు నిలిపిన విద్యుత్ శాఖ అధికారి జి. రవి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి :** వినాయక నిమజ్జనం అంటే భక్తి, డప్పుల సందడి, లైటింగ్ వెలుగులు. ఆ వెలుగుల వెనుక కంటికి కనిపించని కష్టం ఉంటుంది. ఆ కష్టాన్ని భుజాన వేసుకుని వర్షంలోనూ తడుస్తూ విధులు నిర్వహించిన వ్యక్తే విద్యుత్ శాఖ అధికారి జి. రవి. నిమజ్జనం రోజున ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. నిమజ్జన ఘాట్ వద్ద కరెంటు తీగల మీద చెట్లు పడి, పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జనం భయపడుతున్న సమయంలో.. రెయిన్ కోట్ కూడా లేకుండా తన సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు రవి వర్షంలో తడుస్తూనే లైన్లు చెక్ చేయడం, తడిసిన వైర్లను సరి చేయడం, నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడం.. అన్నీ స్వయంగా పర్యవేక్షించారు. మా పండగ ఆగకూడదు, ఒక్క చిన్న షాక్ కూడా తగలకూడదు" అనే లక్ష్యంతో ఆయన పడిన శ్రమను చూసి స్థానికులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఫిదా అయ్యారు. విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన జీ రవిని ఆయన సిబ్బందికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ తిరుమలాయపాలెం మండల ఉపాధ్యక్షుడిగా మాగి వెంకన్న

- ఏకగ్రీవంగా ఎన్నిక.. జిల్లా స్థాయి నాయకుల సమక్షంలో బాధ్యతల స్వీకరణ
- చిన్ననాటి నుంచే విద్యార్థి సమస్యలపై పోరాటాల్లో చురుకైన పాత్ర
- 1995 నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యక్రమాల్లో నిరంతర భాగస్వామ్యం
- మాదిగల హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడి



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 23:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తిరుమలాయపాలెం మండల ఉపాధ్యక్షుడిగా హస్నాబాద్ గ్రామానికి చెందిన మాగి వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి నాయకుల సమక్షంలో ఆయనను మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాగి వెంకన్న చిన్ననాటి నుంచే విద్యార్థుల సమస్యలపై స్పందిస్తూ పలు కార్యక్రమాలు, పోరాటాల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. 1995 సంవత్సరం నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించిన వివిధ ఉద్యమాలు, కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటూ వచ్చారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, మాదిగల హక్కులు, సామాజిక సమస్యలకు సంబంధించిన ఉద్యమాల్లో భాగంగా నిర్వహించిన కురుక్షేత్ర మహాసభ, ధర్మయుద్ధం, సైకిల్ యాత్ర తదితర కార్యక్రమాల్లో వెంకన్న పాల్గొన్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు. మండల స్థాయిలో కొత్త బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో మాదిగ జాతి అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని మాగి వెంకన్న తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు వెంకన్నను అభినందించారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీని వెంటనే అమలు చేయాలి

- జీవోలు కాగితాలకే పరిమితం కావడం దారుణం
- అధికారులు తక్షణమే విద్యా సంస్థలను ఆదేశించాలి
- టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ
- అర్వపల్లి నగేష్ డిమాండ్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్న విలేకరులు, (పాత్రికేయుల) సంక్షేమాన్ని విద్యాసంస్థలు, అధికారులు పూర్తిగా విస్మరిస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ హెచ్ 2843 యూనియన్ తీవ్రంగా ఖండించింది.ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లు, కాలేజీలు మరియు ప్రొఫెషనల్ కోర్సుల ఫీజుల్లో కల్పించిన 50 % శాతం రాయితీ సదుపాయం క్షేత్ర స్థాయిలో ఏమాత్రం అమలు కావడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ,అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభంగా ఎటువంటి జీతభత్యాలు లేకుండా పనిచేస్తూ, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఈ ఫీజు రాయితీ ఎంతో ఊరటనిచ్చే విషయమని పేర్కొన్నారు.కానీ చాలా ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు,కళాశాలల యజమాన్యాలు ఈ రాయితీని అమలు చేయడానికి నిరాకరిస్తున్నాయని ఆరోపించారు.సంబంధిత అక్రిడేషన్ కార్డులు చూపించినప్పటికీ, జీవో కాపీలు అందించినప్పటికీ యజమాన్యాలు రకరకాల కారణాలతో పూర్తి ఫీజులు చెల్లించాల్సిందేనని జర్నలిస్టుల పై ఒత్తిడి తెస్తున్నాయని మండిపడ్డారు.ప్రభుత్వం జీవోలు జారీ చేసి చేతులు దులుపుకుందే తప్ప, వాటి అమలుతీరును సమీక్షించడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉన్నత విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే విద్యాసంస్థల యజమాన్యాలు ఈ రకమైన మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నాయని అన్నారు.ఫీజు రాయితీ అనేది జర్నలిస్టుల హక్కు అని, దానిని కాగితాలకే పరిమితం చేయడం సరైంది కాదని హితవు పలికారు.ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి,రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గుర్తింపు పొందిన పాఠశాలలు,జూనియర్ కళాశాలలు,డిగ్రీ, వృత్తి విద్యా సంస్థలకు 50% రాయితీకి సంబంధించిన నిబంధనలను గుర్తుచేస్తూ మరోసారి స్పష్టమైన సర్క్యులర్,ఆదేశాలు పంపాలని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ -2843 యూనియన్ తరపున విజ్ఞప్తి చేశారు.నిబంధనలు ధిక్కరించే విద్యాసంస్థల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరి నీ ఏకం చేసి,జిల్లా కలెక్టరేట్లు, విద్యాశాఖ కార్యాలయాల ముట్టడికి సమాయత్తమవుతామని,ప్రజాందోళన తీవ్రతరం చేస్తామని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 నాయకులు స్పష్టం చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం,విద్యాశాఖ తక్షణమే స్పందించి జర్నలిస్టుల పిల్లలకు 50% రాయితీ అందేలా చూసి న్యాయం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 మామిడి సోమయ్య యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ,అర్వపల్లి నగేష్ కోరడం జరిగింది.

## శాంతి నిలయంలో దొండపాటి అనీషా జన్మదిన వేడుకలు

- మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించిన అనీషా కుటుంబ సభ్యులు
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వర రావు, రావినూతల గ్రామ సర్పంచ్ భూక్య బద్రునాయక్, రావినూతల ఉపసర్పంచ్ దొండపాటి సత్య నారాయణ



**బోనకల్, సెప్టెంబర్ 23 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు, ప్రస్తుత ఆ గ్రామ ఉపసర్పంచ్ దొండపాటి సత్యనారాయణ కుమార్తె దొండపాటి సత్యనారాయణ స్వరూపల దంపతుల కుమార్తె అనిషా పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో గల శాంతి నిలయంలోనే మానసిక వికలాంగుల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిషా కేక్ ను కట్ చేసింది. అనంతరం మానసిక వికలాంగులకు అనిషా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేక్ ను కట్ చేసి మానసిక వికలాంగులకు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా అనిషా పెద్దనాన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు ,రావినూతల గ్రామ సర్పంచ్ భూక్య బద్రు నాయక్, దొండపాటి సత్యనారాయణ మాట్లాడుతూ... మానసిక వికలాంగుల కేంద్రంలో అనిషా పుట్టినరోజు వేడుకలు నిర్వహించటం అభినందనీయమన్నారు. మానసిక వికలాంగులకు శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ ఆల్ఫీ, ఆమె మిత్ర బృందం అందిస్తున్న సేవలకు విలువ కట్టలేమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శాంతి నిలయంలో వదిలేసి వెళ్తుంటే ఆల్పీ బృందం వారికి సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రావినూతల మాజీ సర్పంచ్ గోగులోత్ పంతు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్, బి ఆర్ ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మూడావత్ సైదా, బి ఆర్ ఎస్ యువజన నాయకుడు తుడుం మహేష్, తెలంగాణ రైతు సంఘం రావినూతల గ్రామ అధ్యక్ష కార్యదర్శులు షేక్ నన్నే సాహెబ్, ఎర్రగాని నాగరాజు, రావినూతల గ్రామ పంచాయతీ కార్యదర్శి దామాల వినోద్, సిపిఎం నాయకులు కొంగర గోపి, కొమ్మినేని పిచ్చయ్య, గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ మండల అధ్యక్షుడు మరీదు పుల్లయ్య, ఏఎన్ఎం ఎర్రగాని కృష్ణవేణి, శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ ఆల్ఫీ, ఆమె బృందం పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణనాథుడు

- గణపతి బొప్పా మోరియా నినాదాలతో దద్దరిల్లిన నేలకొండపల్లి ..
- తీన్మార్ డప్పుల దరువులకు యువత స్టెప్పులే.. స్టెప్పులు
- కోలాటాలతో, డ్యాన్స్ లతో మహిళల సందడి....
- రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు....
- బాణాసంచా మోతలతో హోరెత్తిన ప్రధాన వీధులు...
- భారీ ఊరేగింపులతో పెద్ద చెరువుకు చేరిన గణనాథులు..
- ప్రశాంతంగా నిమజ్జనం... పోలీసుల గట్టి బందోబస్తు...





**నెలకొండపల్లి, సెప్టెంబర్ 23 ప్రజా జ్యోతి :** మండలంలో బుధవారం గణేష్ నిమజ్జనం లో భాగంగా జరిగిన ఊరే గుంపులో గణపతి బొప్పా మోరియా నినాదాలతో మండలంలోని గ్రామాల్లో దద్దరిల్లింది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఊరేగింపులు నిర్వహించగా, గణనాథుల దర్శనానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించి, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, డీజే సంగీతాల నడుమ ఊరేగింపులు సాగాయి. తీన్మార్ డప్పుల దరువులకు యువత ఉత్సాహంగా స్టెప్పులు వేస్తూ సందడి చేయగా, మహిళలు కోలాటాలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. యువత, చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు భక్తులు ప్రత్యేక దుస్తులు ధరించి గణనాథుడి ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు చోట్ల బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకోవడంతో పట్టణ ప్రధాన వీధులు సందడిగా మారాయి. మేళగాళ్లు, డప్పు బృందాలు, మైక్ సౌండ్ సిస్టమ్‌లకు భారీగా డిమాండ్ కనిపించింది. వివిధ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివెళ్లే భక్తులకు మంచినీరు, ప్రసాదం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి తరలివెళ్తున్న హిందూ భక్తులకు మంచినీరు అందించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పరస్పర సహకారం, సోదరభావంతో నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పలుచోట్ల పోటాపోటీగా పులి హోరా ప్రదర్శనలు నిర్వహించడంతో యువత, భక్తుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. గణపతి లడ్డూ ప్రసాదాల పంపిణీ కూడా విస్తృతంగా చేపట్టారు. భక్తులు లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి గణనాథుడి ఆశీస్సులు పొందారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గణపయ్యలను పెద్దచెరువు వద్ద నిమజ్జనం కోసం తరలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ విగ్రహాల కోసం చెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన ప్రదేశంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల నాయకులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు భోజన వసతి కల్పించారు. గణనాథుల ఊరేగింపులు, భక్తుల జయజయధ్వానాలు, డప్పుల దరువులు, మేళతాళాల మధ్య సాగి చివరకు పెద్దచెరువు నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నాయి. భక్తులు గణపయ్యకు చివరి పూజలు నిర్వహించి, కన్నుల పండువగా వీడ్కోలు పలికారు. అనంతరం గణనాథులను భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం పూర్తవడంతో నిర్వాహకులు, పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల ఐక్యత, పరస్పర సహకారం, మత సామరస్యం, శాంతియుత వాతావరణంలో జరిగిన నిమజ్జన వేడుకలు నెలకొండపల్లి లో పండుగ వైభవాన్ని చాటిచెప్పాయి.

## ప్రటీష్ట భద్రత నడుమ జీలచెరువు ఊర చెరువులో గణేశ నిమజ్జనం

- భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడుకోలు
- భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవం
- కూసుమంచి మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ సైదులు, ఎంపీడీవో జస్వంత్ కుమార్, ఎస్.ఐ నాగరాజు,
- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు





**పాలేరు ఆర్.సీ సెప్టెంబరు 23 ప్రజా జ్యోతి** గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు కూసుమంచి మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ సైదులు, ఎంపీడీవో జస్వంత్ కుమార్ కూసుమంచి ఎస్ఐ నాగరాజు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కూసుమంచి మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ,స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు.నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు,ఉత్సవ కమిటీ సభ్యులు,అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది,పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో,గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు.శోభాయాత్రలో పాల్గొనే భక్తులు,నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా,విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రెవిన్యూ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఇరిగేషన్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్ స్టేషన్, కరెంట్ డిపార్ట్మెంట్ శాఖ, మత్స్య పరిశోధన శాఖ,ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అనంతరం కూసుమంచి మండల పరిధిలోని జిల్లా చెరువు గ్రామంలో చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అయిత గాని వెంకటరమణ, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు,పాలక మండల్ సభ్యులువివిధ శాఖ ప్రభుత్వ అధికారులు వివిధ గ్రామ ప్రజలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.